# స్వయంచాలేదు!

కందుకూరి వెంకట మహాలక్ష్మి

ఆ రోజు దినపత్రికలోని మొదటి పేజీలో బాక్సు ఐటమ్ పాఠకులందర్నీ ఆశ్చర్యంతో ముంచెత్తడమే కాకుండా, కలవరపర్చింది కూడా. ఇది ఒక విచిత్రమైన వార్తేకాదు. ఘోరమైన వార్తకూడ. ఆ వార్త చదివి ఆశ్చర్యపోవడానికి మరోకారణం ఆ సంఘటన జరిగింది ఒక తెలుగు వారింట.

"శ్రీహరి అనే ఒక గుమాస్తాని భార్య కుముద కత్తితో పొడిచి చంపడమే కాకుండా ముక్కలు, ముక్కలుగా నరికి గోనె సంచీలో కుట్టి దొడ్లో పాతిపెట్టింది. కొన్ని రోజులకి కుళ్ళువాసన భరించలేక యిరుగుపొరుగులు రిపోర్టివ్వగా పోలీసులు రంగంలోకి దిగి ఈ రహస్యాన్ని ఛేదించారు. అంతే! కుముదని అరెస్టు చెయ్యడం, ఈ వార్త దినపత్రికల్లోకి ఎక్కడం ఒకేసారి జరిగిపోయాయి.

అపరిచితులంతా ఆ వార్తని ఆశ్చర్యంతో కొద్దిసేపు చర్చించుకుంటే పరిచితులకా వార్త చర్చనీయాంశమయింది.

ఊళ్ళోవాళ్ళకయితే అదో పెద్ద కాలక్షేపమయి కూర్చుంది. ఆ వింతని తిలకించడానికి జనం గుంపులు గుంపులుగా వెళ్ళసాగారు. లోనికెళ్ళబోయిన వారిని పోలీసులడ్డగిస్తున్నారు. అయినా ఆడా, మగా, పిల్లా, పెద్దా ఆ యింటిని దర్శించుకుని ఆ యింట్లోని వ్యక్తుల గురించి తెలిసినదానికి తెలియనిది జోడించి, యింతని అంత చేసి చెప్పి ఆనందించేవారు కొందరయితే, ఆ యింటి ఆడదాన్ని దుమ్మెత్తిపోసేవారు మరికొందరవుతున్నారు. కొందరు జాలీ, సానుభూతులతో మాట్లాడితే, కొందరు రోషావేశాలతో మాట్లాడుతున్నారు. ఇంతకీ అందులో ఏ ఒక్కరికీ అసలు నిజం తెలీకపోయినా కట్టు కథ అల్లడంలో వారి, వారి ప్రావీణ్యతని కనబర్చుకుంటున్నారు.

"ఇన్నాళ్ళూ అత్త, ఆడబిడ్డలూ, భర్త యింటి కోడళ్ళని హింసించడం, చంపడంలాంటివి జరిగేవి. ఇప్పుడు భార్యే భర్తని పొడిచి చంపేసింది. కలికాలం అంటే యిదేరా బాబూ! ఆడదానికి స్వతంత్ర్యం, సమాన హక్కులూ యిచ్చి నెత్తికెక్కించుకుంటే వాళ్ళు తిరగబడక ఏంచేస్తారు?" అంటూ విమర్శించే పురుషులు కొందరైతే, 'ఆడదానికదేం పొయ్యేకాలం? ఎంతయినా మొగుడు మొగుడేకదా? ఏమన్నా సంసారంలో మంచి చెడ్డలుంటే సరిపెట్టుకోవాలిగానీ, పొడిచి చంపేటంత రాక్షసేమిటి?" అని ఆడి పోసుకునే ఆడవాళ్ళు మరికొందరు.

జనం గుంపులు, గుంపులుగా ఆ యింటి బైట నిలబడి కాలక్షేపం కబుర్లాడుకుంటుంటే, లోపల వేలిముద్రల నిపుణులు, ఫొటోగ్రాఫర్లు, పత్రికల వాళ్ళూ పోలీసు డిపార్టుమెంటువారు వారి వారి పనుల్లో నిమగ్నమైయున్నారు.

ఆ యింట్లో పదమూడేళ్ళ స్వప్న తప్ప ఎవ్వరూ లేరు. స్వప్న బిక్కచచ్చిపోయి ఓ మూలగా నిలబడి తనింట్లో జరుగుతున్న హడావిడి, హంగామాలని పిచ్చిదానిలా చూస్తోంది. ఎవ్వరేం అడిగినా జవాబుగా కళ్ళంట నీళ్ళు ధారలు కట్టించడం తప్ప మాట్లాడలేకపోతోంది. అయినా ఆమెని అడగవలసినవి అడుగుతూ, బాధించడం మాత్రం మానలేదక్కడున్న ఆఫీసర్లు. ఇటు పెద్ద, అటు పిన్నకాని వయసులో యింట్లోని వాతావరణాన్ని అర్థం చేసుకునీ, చేసుకోలేని వయసులో వున్న స్వప్నని ఏ ప్రశ్న వేసినా "నాకు తెలీదండీ!" అంటూ మేఘాలు లేని వర్షంలా జలజలా కన్నీళ్ళు కార్చడం తప్ప మరే సమాధానం చెప్పటంలేదు.

గవర్నమెంటు ఆఫీసులో శ్రీహరి గుమాస్తా. శ్రీహరికి కుముదతో వివాహమయిన ఈ పదిహేనేళ్ళల్లో నాలుగూళ్ళు బదిలీల మీద తిరిగాడు. ఈ వూరికొచ్చి కొద్దిరోజులే కావడంతో యిరుగు, పొరుగులకి వీరి సంసారం గురించిన వివరాలు ఎక్కువగా తెలీక ఈ హత్యలోని ఆంతర్యమేమిటో గ్రహించలేక తికమకపడుతున్నారు. స్వప్నవల్ల ఏమీ రాబట్టలేని పోలీసు అధికారులు, యిరుగు, పొరుగుల్ని ప్రశ్నించడానికి వెళ్ళినప్పుడు కొందరు తెలిసీ తెలియంది చెప్తే, మరికొందరు 'పోలీసుల గొడవల్లో యిరుక్కోకూడ'దంటూ తప్పించుకున్నారు.

ఇంతలో ఎవరో విసిరిన నిప్పురవ్వ రగులుకుని, రగులుకుని భగ్గుమంది. ఆ నిప్పురవ్వ విసిరింది ఎవరో తెలీదుగాని, ఆ రవ్వ భగ్గుమనడానికి తోడ్పడినవారు అనేకమంది. గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఆఖరికా వార్త మర్నాటి పేపర్లో మొదటి పేజీకెక్కి కూర్చుని, అందరిళ్ళల్లో చర్చనీయాంశమయింది.

కుముదకి పరాయి పురుషుడితో అక్రమ సంబంధం వుందని, అది తెలిసి శ్రీహరి భార్యతో ఆ రాత్రి ఘర్షణపడ్డాడని, భార్యాభర్తల మధ్య వాద వివాదాలు పెరిగి అది హత్యకి కారణమయిందని. ఈ హత్య వెనుక ఒక్క కుముదదే కాకుండా కుముద ప్రియుడి చెయ్యికూడా వుందని పత్రికలు వ్రాసిన వార్తని చదివి ఆడా మగా కుముదని నానా రకాలుగా దూషించి, కులటగా జమకట్టారు.

"గడించి పోసే భర్త వుండగా ఆడదానికిదేం పొయ్యేకాల"మని. "ఇలాంటి ఆడవాళ్ళనుంచే స్త్రీ జాతికి తలవంపు"లని, "ఇలాంటి పన్లు మగవాడు చేస్తే చెల్లిందిగానీ ఆడదానికి చెల్లుతుందా? చెప్పం"డంటూ మామ్మల నీతులయితే, "ఇలాంటి ఆడవాళ్ళని నలుగుర్ని నడి రోడ్డుమీద కొరత వేస్తేగానీ బుద్ధిరా"దంటూ మగాళ్ళూ విమర్శించసాగారు.

బెయిలిచ్చే దాత, దిక్కు లేని కుముద బిడ్డని అనాధ ఆశ్రమంలో వుంచి కటకటాల్లోనే కూర్చుంది. ముప్పైఅయిదేళ్ళు నిండని కుముద

తన తరపున వాదించడానికి ఏ లాయరూ అక్కర లేదని చెప్పింది.

ఆరోజు తన కేసు విచారణ జరుగుతుంది. కటకటాల్లో కూర్చున్న కుముద బుర్రలో ఎనలేని ఆలోచనలు. కానిస్టేబుల్‌ని పిల్చి "బాబూ! ఈరోజు నా కేసు విచారణకదూ? నాకు కొన్ని తెల్లకాగితాలు ఓ పెన్ను అడిగి తెచ్చిపెట్టు బాబూ!" అని అడిగింది. అతనికి ఎందుకో కుముదని చూస్తే జాలీ, అభిమానం తొలినాటినుంచే కలగడంతో వెంటనే పెన్ను కాగితాలు తెచ్చియిచ్చాడు.

కేసు విచారణకి కుముదని కోర్టుకి తీసుకొచ్చారు. కోర్టు హాలునిండా జనం కిక్కిరిసిపోయారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుముద భర్తని ఎలా హత్యచేసిందీ చెప్పి, తన కర్తవ్యాన్ని ముగించాడు.

దానికి జవాబు చెప్పుకోవల్సిందిగా కుముదని బోనులోకి రప్పించారు. కుముద తలవంచుకుని బోనులోకి ఎక్కి ఉబికి వస్తున్న దుఃఖాన్ని చీర కొంగుతో అణుచుకోడానికి ప్రయత్నిస్తూ తను వ్రాసి తెచ్చుకున్న కాగితాలని తన పక్క నిలబడ్డ కానిస్టేబుల్‌కి అందిచ్చి, జడ్జీకిమ్మని చెప్పి బోను దిగిపోయింది.

జడ్జీగారి అనుమతయినమీదట ఆ కాగితాలని చదవసాగారు.

"పెద్దలు, గౌరవనీయులు, జడ్జీగారికి! మనిషి ఏ అఘాయిత్యం చేసినా, హత్యచేసినా దాని వెనుక బలీయమైన కారణముంటుందని మీకు వేరే చెప్ప నవసరం లేదనుకుంటాను. నాకు యిరవయ్యవ ఏట వివాహమయి శ్రీహరిగారింటికొచ్చాను. కీద యిలాటి ఆదపడుచునవడంవల్ల నా తండ్రి నన్ను యితనికి రెండో భార్యగా కట్టబెట్టి తన బాధ్యతతో పాటు, ఈ లోకంతో కూడా తన బంధాల్ని వదుల్చుకుని వెళ్ళిపోయాడు. దిక్కూ, మొక్కూ లేని నేను నా భర్త యింట అడుగెట్టిందిమొదలు అతని అడుగుజాడల్లోనే నడుచుకుంటు, అతనే సర్వస్వమని నమ్మి, ఎంతో పొదుపుగా సంసారాన్ని నడుపుకుంటూ కాలాన్ని వెళ్ళబుచ్చేదాన్ని.

ఓరోజు నా భర్త క్యాంపు వెళ్ళాడు. సాయంత్రం ఒంటరిగా కూర్చున్న నాకు తలుపు తట్టిన శబ్దం కావడంతో వెళ్ళితీసాను. ఎదురుగా సూటూ, బూటూలో వున్న ఓ వ్యక్తి లోపలికి ప్రవేశించి, నా భర్త పై ఆఫీసర్‌గా తన్నుతాను పరిచయం చేసుకున్నాడు. కొంతసేపటి తరువాత ఆయన చెప్పిన విషయమేమిటంటే శ్రీహరి ఆఫీసు డబ్బు నాలుగు వేలు కాజేసాడనీ, అది రెండు రోజుల్లో కట్టకపోతే జైలుపాలవుతాడనీ చెప్పడంతో, నెత్తిన పిడుగుపడ్డట్టయి నాకు ముచ్చెమటలుపోసాయి. కలలోనైనా భర్త గురించి ఊహించని వార్త. కళ్ళు తిరిగినట్లయి పడిపోయాను. నాకు తెలివి వచ్చేవరకూ నా పక్కనే కూర్చుని ఆ ఆఫీసర్ నాకు సపరిచర్యలు చేసారు. అతని అభిమానానికి ధన్యవాదాలర్పించాను. కొద్దిసేపటికి అతనులేచి వెళ్ళబోతుండగా నేను లేచి అతని కాళ్ళపైబడి నా భర్తని కాపాడే మార్గం సూచించమని వేడుకున్నాను. నన్ను లేవనెత్తి కూర్చోపెడుతూ "నీ భర్తని విడిపించాలంటే ఒక్కటే మార్గం నీవద్ద ఏవన్నా బంగారం వుంటే అమ్మియియ్యి లేదా ఈ రాత్రికి నువ్వు నాతో గడుపు ఆ డబ్బు నేను కట్టేస్తా" నన్న మాటలకి కరెంట్ షాక్ తగిలినట్లు లేచి నిలబడిపోయాను. నా తండ్రి వయసు మనిషి. ఇంతసేపూ ఆ వ్యక్తి యందు నాలో చోటు చేసుకున్న పూజ్యభావం ఒక్కసారిగా తొలగిపోయింది. ఒక కిరాతకుడిగా నాకు కనిపించసాగాడు.

అతను లేచి మళ్ళీ బైటికి నడవసాగాడు. వెంటనే తేరుకుని ఆయన్ని వెనక్కి పిల్చి నా వద్ద ఏమీ బంగారంలేదని చెప్పి, నా దైవమనుకున్న భర్తని రక్షించే నిమిత్తం నా జీవితాన్నర్పించి అపవిత్రురాలినయ్యాను.



జీవితంలో ఒకసారి జరిగింది పొరపాటవుతుంది. మళ్ళీ మళ్ళీ జరక్కుండా జాగ్రత్తపడితే ఆ తప్పు సర్దుకుపోతుందన్న ధైర్యం, నమ్మకం

నాకుంది. నా దేముడికోసం చేసిన తప్పది. అది నా భర్త దగ్గర దాచడం నాకిష్టంలేక రాగానే అతన్ని నిలదీసి ఆ విషయం అడిగాను. "అవున" నిజవాబు రావడంతో ఆశ్చర్యపోయాను. తరవాత జరిగినదంతా చెప్పి, యింక అలాంటి పన్లు చెయ్యడని ప్రమాణం చేయించుకున్నాను. భార్య దగ్గర ఎంతో అణుకువతో ప్రమాణం చేస్తున్నప్పుడు కూడా తన భార్య పరాయి వ్యక్తికి తన శరీరాన్నర్పించిందన్న బాధ నా భర్త వదనంలో కానరాకపోవడం నాకు చాలా దుఃఖాన్ని, బాధని కలిగించింది.

కానీ అది అంతటితో ఆగలేదు. కొన్నాళ్ళ తరవాత మరో సంఘటన యిటువంటిదే జరిగింది. మళ్ళీ మరొకసారి నేను దిగజారి నా భర్తని కాపాడుకున్నాను. ఇలా యిది అప్పుడప్పుడు జరగడం, నన్ను నేను నాశనం చేసుకుని నా భర్తకి శిక్ష తప్పించడం పరిపాటయిపోయిందనే కంటే, నా భర్త నన్ను ఎరపెట్టి ఆఫీసు డబ్బు తినెయ్యడం, ఆఫీసర్లని యింటికి తీసుకురావడం అలవాటయి పోయిందనడం సమంజసమేమో। నా భర్త నీచత్వాన్ని అవగాహన చేసుకున్నాను. కానీ నాకు వేరే మార్గం లేక ఆ కుళ్ళు బ్రతుకుని సాగిస్తున్నాను. దానికి కారణాలు — నేను చదువుకోని దానినవడం, ఏడాది బిడ్డ స్వప్న భవిష్యత్ నా కళ్ళ ముందర మెదలడం, గుండెల్లో అగ్నిగుండాన్ని దాచుకుని ఈ సంసారాన్నిలా పదిహేనేళ్ళపాటు లాక్కొచ్చాను. నేను నాశనమయిపోయి, నా పరువు పోగొట్టుకుని, నా భర్తని రక్షిస్తూ వచ్చాను. కానీ ఆ రోజు నా సహనం చచ్చి, నా ఓర్మిచచ్చి దేముడిగా నమ్మిన నా భర్తని హత్య చేసానంటే కారణం ఒక్కసారి ఆలోచించండి??

ఆ రోజు రాత్రి నా భర్త ఒక మగవాడితో వచ్చాడు. ఆ పెద్దమనిషిని గదిలో కూర్చోబెట్టి వంటింటిలోకి వచ్చిన నా భర్త "కుముదా ప్లీజ నేను చాలా పెద్ద గొడవలో యిరుక్కున్నాను. మొన్న ఆఫీసు మేనేజర్ యిచ్చిన డబ్బు బ్యాంకిలో జమచెయ్యడానికి వెళ్తూంటే దొంగలు ఆ బాగ్ కొట్టేసారు. రక్షించమని ఆఫీసర్‌ని కాళ్ళావేళ్ళా పడి బ్రతిమాలితే శిక్ష తప్పించడానికి ఒప్పుకున్నాడు. ఈ ఒక్కసారికీ, ఈ ఒక్కతప్పూ మన్నించు. మరెప్పుడూ యిలా జరగ" దంటూ బ్రతిమాలుతున్న శ్రీహరిని చీత్కారంతో చూసి




నప్పటికి, అవన్నీ కట్టుకథలని తెలిసినప్పటికీ నిస్సహాయురాలినైన నేను యింటికి తీసుకొచ్చిన ఆ పెద్దమనిషికి సత్కారం చెయ్యక తప్పదని తెలిసి మౌనంగా వూరుకున్నాను. నా మౌనాన్ని అంగీకారంగా తీసుకున్న నా భర్త లోపలినుంచి తెచ్చిన పేకెట్ విప్పి, ఈ చీర స్వప్నకి కట్టి ఈ పూలు దాని తలలో పెట్టమన్నాడు. నా గుండె ఒక్కసారి కొట్టుకోవడం ఆగిపోయింది. కళ్ళు చింతనిప్పులయ్యాయి "దాని కెందుకు?" అన్నాను ఆడసింహంలా గర్జిస్తూ. "ఈ ఆఫీసర్‌కి స్వప్నే నచ్చిందిట" అన్నాడు కించిత్తయినా బెదరకుండా. ఎవరో నా కాళ్ళక్రింద నిప్పులు పోసినట్లయింది. శరీరమంతా భగభగ మండసాగింది. నన్ను నాశనం చేసింది చాలక ముక్కుపచ్చలారని స్వప్నని కూడా నాశనం చెయ్యజూస్తున్న శ్రీహరిని చూడగానే పట్టలేని కోపం, అసహ్యం కలిగాయి. 'ఛీ- వీడు నా బిడ్డకి తండ్రేనా??" అనుకున్నాను. నా మెదడంతా మొద్దుబారి విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయింది. నా భర్తకోసం నాశనమయిపోతూ, బిడ్డ కోసమే బ్రతుకుతున్న నేను స్వప్న బ్రతుకు కూడా నాశనమయిపోతోందని గ్రహించాను. ఇది ఈ ఒక్కసారితో ఆగేది కాదని నాకు తెలుసు. ప్రక్కనే కూరలు తరిగే కత్తి తళతళ మెరుస్తూ కర్తవ్యాన్ని గుర్తు చేసింది. ఆ కత్తినందుకుని ఆడపులిలా నా భర్త మీదకి విజృంభించి ఒక్కపోటు పొడిచాను. నా భర్త పెట్టిన చావుకేకకి వచ్చిన పెద్దమనిషి పరారయ్యాడు. కలతనిద్రలో స్వప్న వెర్రికేక పెట్టింది. కొద్దిసేపటికి నేనీలోకం లోకి వచ్చి, కసితీరా నా భర్తని ముక్కలు, ముక్కలుగా నరికి పాతిపెట్టాను. నేను హంతకురాలినైనా నా బిడ్డని కాపాడుకున్నాను. నాకది తృప్తిగా వుంది. ఇన్నేళ్ళుగా నా గుండెల్లో దాచుకున్న మంట చల్లారింది. నాకు ఏ శిక్ష వేసినా అనుభవించడానికి సిద్ధంగా వున్నాను. చచ్చేముందు కోరేకోరిక తీరుస్తారని విన్నాను. నాదో చిన్న కోరిక. నాకు ఉరిశిక్ష వేసాకా అనాథాశ్రమంలో వున్న నా బిడ్డకి నా గతి పట్టకుండా యిక్కడున్న ఏ ఒక్కరైనా ఒక మంచి మార్గం చూపించమని వేడుకుంటున్నాను. అదే నా ఆఖరి కోరిక. మరొక్క చిన్న మనవి. కూతురి వయసు ఆడపిల్లల జీవితాలని నాశనం చేసి, వారిని పతనం చేస్తున్న కామాంధుల్ని, కిరాతకుల్ని, దుర్మార్గుల్ని

కూడా ఈ న్యాయస్థానం శిక్షించగలిగితే, ఈ కోర్టులకి సార్థకత లభిస్తుంది. లోకంలో వున్న కీచకులందర్నీ శిక్షించేశక్తి, పట్టి అప్పగించేశక్తి మీకూ, నాకూ లేకపోయినప్పటికీ, ముక్కుపచ్చలారని నా బిడ్డ జీవితాన్ని నాశనం చెయ్యబోయిన వ్యక్తిని నేను ఎరుగుండడం వల్ల, ఆ వ్యక్తి వివరాలు యిక్కడ యిస్తున్నాను. కనీసం అటువంటి ఒక్క వ్యక్తినయినా మీరు శిక్షిస్తే కూతురు, మనుమలు వంటి పరాయి ఆడపిల్లల జీవితాలతో ఆటలాడకుండా కొందరన్నా ఉంటారేమోనన్న ఆశతో అతని ఎడ్రసు యిక్కడ యిస్తున్నాను. యింతకిమించి నే చెప్పేదేమీలేదు.

ఈ పెద్దమనిషి పారిపోతూ నా యింట్లో మర్చిపోయిన అతని పర్సులో అతని ఎడ్రసు వుంది. ఆ పర్సు నా బీరువాలో వుంది. అదే నా కేసుకి సాక్ష్యం.

శలవు తీసుకుంటూ

కుముద

ఎడ్రసు జె. వి. క్రిష్ణమూర్తి

ఉద్యోగం, ఆఫీసు, ఊరు.

ఆ ఉత్తరాన్నంతా శ్రద్ధగా విన్న జడ్జీ ఆఖర్ని తలెత్తి కుముదవైపు చూసి రెండు కన్నీటి బొట్లు రాల్చడం చూసిన వారంతా చకితులయ్యారు.

కేసు వాయిదా పడింది. జడ్జీగారు భారంగా లేచి కదిలారు.

పేపర్లు శ్రీహరి హత్యకేసుని, ఎప్పటికప్పుడు ప్రజలకందిస్తూనే వున్నాయి.

ఆ రోజు పేపర్‌లోని వార్త అశేష జనాన్ని స్థంభింపజేసింది.

"జడ్జీ జగన్నాధంగారు తన కొడుకునే అరెస్టు చేసారు. తల్లి తన బిడ్డమానాన్ని రక్షించే నిమిత్తం (కుముద) చేసిన హత్య కేసుని కొట్టేసినట్లుగా తీర్పుయిస్తూ, ఈ హత్యకు పరోక్షంగా కారకుడైన జె. వి. క్రిష్ణమూర్తిని అరెస్టు చేయించినట్లుగా తీర్పు యివ్వడమైనది." అన్న వార్తని పెద్ద పెద్ద అక్షరాలతో మొదటి పేజీలోనే పేపర్లు ప్రచురించాయి.

"ఇటువంటి మహామనిషి కోటికొక్కడన్నా యింకా వుండబట్టే దేశంలో న్యాయం యింకా బ్రతికి వుంది" అనుకుంటూ తృప్తిగా అక్కున జేర్చుకుంది కుముద స్వప్నని. □

# పెరిగిపోతున్న ఒంటరితనం

ఇటీవలి కాలంలో ప్రపంచంలోని వివిధదేశాలకు చెందిన వారిని బాధపెడుతున్న సమస్య - ఒంటరితనం. ఏరికోరి సన్యాసం తీసుకున్నవారికి తప్ప తక్కినవారికి ఒంటరితనం బాధాకరంగా వుంటుంది. మన దేశంలోనూ ఒంటరితనం వల్ల ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే వుంది.

తమ పరిసరాలలో వున్నవారితో కలిసిమెలిసి వుండలేకపోవడం, తమకు అనుకూలమైన వాతావరణం వుండకపోవడం, తగిన వ్యాపకాలు లేకపోవడం, అనాదరణకు గురికావడం-ఇలా ఒంటరితనానికి రక రకాల కారణాలు కనిపిస్తాయి.

ఒంటరితనం ప్రధానంగా ఎవరిని పీడిస్తున్నది?

గ్రామాలలో వున్న వారికన్నా నగరాలలో వున్న వారికి ఒంటరితనం బాధ ఎక్కువనీ, పసిపిల్లలూ వృద్ధులూ ఒంటరితనం వల్ల బాగా ఎక్కువగా బాధ పడుతున్నారనీ తేలింది.

తల్లులకు దూరంగా వుండి పెరిగే పిల్లలలో ఒంటరితనం బాధ కాస్త ఎక్కువే. ఉద్యోగాలు చేసుకునే స్త్రీల సంతానానికి ఒంటరితనం కఠిన శిక్ష. తల్లులు తమను ఒంటరిగా వదిలిపెట్టి ఉద్యోగాలకు వెళ్ళిపోతే ఆరుమాసాల శిశువులు కూడా ఒంటరితనాన్ని అనుభవించకతప్పదని మనస్తత్వ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అలా ఒంటరిగా పెరిగేపిల్లలు పెద్దవారయితే సంఘానికి సమస్యలుగా తయారయ్యే అవకాశాలు వున్నాయట. ఒంటరితనం-తమను ఆదుకునేవారు ఎవరూలేరు అనే మనస్తత్వాన్ని పెంచుతుంది. దాంతో బాటు ఆందోళన, భయం, మందకొడితనం కలిగిస్తుంది.

కొత్తగా బడికి వెళ్ళే పిల్లలలోనూ ఒంటరితనం సమస్య కనిపిస్తుంది. ఆ కొత్త వాతావరణానికి అలవాటుపడే దాకా ఆందోళనగానే వుంటుంది. ఈ ఆందోళన వల్లనే పిల్లలు తరచుగా ఏడుస్తుంటారు. మొండిగా ప్రవర్తించి బడికి వెళ్ళడానికి మొరాయిస్తారు. ఈ దశలో తల్లీ ఉపాధ్యాయులు పిల్లలకు నచ్చజెప్పి ఊరట కలిగించకపోతే పిల్లలు దురలవాట్లకు గురయ్యే ప్రమాదం వుంది.

అలాగే కొత్తగా పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళే ఆడపిల్లలకు కూడా తొలిరోజులలో ఒంటరితనం తెలుస్తుంది. మానసికంగా ఎదిగిన వాళ్ళకు ఈ బాధ అంతగా వుండదు. ఆ ఎదుగుదల లేకపోతే మాత్రం ఒంటరితనం వల్ల హిస్టీరియా, మందకొడి తనం వంటి మానసిక సమస్యలే కాకుండా ఋతుస్రావంలో అవకతవకలు, వీపునొప్పి, అజీర్ణం మొదలైన శారీరక సమస్యలు కూడా మొదలవుతాయి.

ఉద్యోగాలకు వెళ్ళేవారిలో కూడా ఆ ఉద్యోగం చేసే వాతావరణం అనుకూలంగా లేకపోతే ఒంటరితనమే మిగులుతుంది. ఫలితంగా ఆందోళన పెరుగుతుంది. దాంతో ఉబ్బసం, పెప్టిక్ అల్సర్, అజీర్ణం వంటి సమస్యలు మొదలు.

భర్త ఉద్యోగానికీ, పిల్లలు బడికి వెళ్ళిపోతే, మరొక మనిషి తోడులేని స్త్రీకి ఏ వ్యాపకమూ లేకపోతే, అది ఆమెకూ ఆమె కుటుంబానికీ నరకమే. కోడలు రావడంతో కుటుంబంలో తమ అధికారానికి భంగం కలిగిందనుకుని బాధపడే స్త్రీలకూ ఒంటరితనం సమస్యే.

ముసలితనంలో పిల్లలకు దూరంగా వుండే పెద్దవారిలో ఒంటరితనం కలిగించే సమస్యలు ఎన్నెన్నో. ఒకవేళ పిల్లలతోనే వున్నా వాళ్ళు తమ సలహాలు పాటించక పోయినా, తామే మారుతున్న కాలాన్ని సరిగా అవగాహన చేసుకోలేకపోయినా, తమకు ఎవరూ లేరనుకునే స్థితికి వస్తారు.

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన వారు మరణించినప్పుడు కొందరిలో తీవ్రమైన మార్పులు వస్తాయి. అటువంటివారు తిండి, నిద్ర దూరం చేసుకుని ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ తమ పరిసరాలను పట్టించుకోకుండా ఒంటరిగా వుండిపోతారు. తగిన చికిత్స జరగకపోతే ఈ రకం ఒంటరితనం ఆత్మహత్యకు కూడా కారణమవుతుంది.

మన దేశంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ సన్నగిల్లిపోతూ వుండడం వల్లా, బతుకుతెరువు కోసం వున్న వూరినీ, అయిన వారినీ వదిలి వెళ్ళవలసి రావడం వల్లా ఒంటరితనం సమస్య ఎక్కువవుతూ వున్నది.

బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగు పెడుతున్న వారికి తల్లిదండ్రుల నుంచి సరయిన రక్షణ, ఆదరణ లభించకపోతే వారిలో ఒంటరితనం బయలుదేరి విచ్చలవిడితనం, నేరాలు చేసే తత్వం అలవడే ప్రమాదాలు వున్నాయి.

మరి ఒంటరితనానికి విరుగుళ్ళు లేవా అంటే వున్నాయి. మానసికంగా ఎదిగిన వాళ్ళకు ఒంటరితనం పెద్ద సమస్య కాదు. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, తోటపని చెయ్యడం అల్లికలు కుట్లు నేర్చుకోవడం, ఇలా రక రకాల వ్యాపకాలు పెట్టుకుంటే ఒంటరితనం బాధించదు.

ముసలితనంలో ఒంటరిగా వుండే వారికి సహాయపడడం కోసం మనదేశంలో కొన్ని 'గృహాలు' పనిచేస్తున్నాయి. అయితే పెరిగిపోతున్న ఒంటరితనాన్ని ఎదుర్కోవడానికి మరిన్ని గృహాలు కావాలి. □